క్లుప్తంగా

కొరువాడ జగన్నాథపురం గ్రామ వలంటీర్ల రాజీనామా

కె.కోటపాడు: కొరువాడ జగన్నాథపురంలో ఐదుగురు వలంటీర్లు బుధవారం రాజీనామాను చేశారు. రాజీనామా పత్రాలను పంచాయతీ కార్యదర్శి రాజుకు అందించారు. తమకు వలంటీర్ విధుల ద్వారా ఉపాధి కల్పించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మరోమారు ముఖ్యమంత్రిగా చేసుకునేందుకు సిద్ధంగా ఉన్నట్లు వారు తెలిపారు. మాడుగుల ఎమ్మెల్యేగా ఈర్లె అనురాధ, ఎంపీ బూడి ముత్యాలనాయుడులను గెలిపించుకునేందుకు పని చేస్తామన్నారు.

వైఎస్సార్‌సీపీని ఆదరించండి



శంకరంలో గిరిజన నాయకులతో మాట్లాడుతున్న ఎంపీపీ రాజారామ్

మాడుగుల: వైఎస్సార్ సీపీ చేసిన అభివృద్ధి చూసి ఆదరించాలని ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్ కోరారు. బుధవారం ఆయన శంకరం పంచాయతీ కృష్ణంపాలెంలో 14 గిరిజన గ్రామాల నాయకులతో సమావేశమయ్యారు. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ఎంతో అభివృద్ధి చేశారనన్నారు. అంతకుముందు ఇదే పంచాయతీలో కొత్తవలస, రాజంపేట, గొప్పూరు, కృష్ణంపాలెం, బొడ్డరేవు, వేంపురం, శంకరంతోపాటు మరో ఏడు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు బూడి ముత్యాలనాయుడు, ఈర్లె అనురాధలను గెలిపించాలని అభ్యర్థించారు. కడప, పరువాడ నుంచి వచ్చిన అభ్యర్థులను ఓడించాలన్నారు. సర్పంచ్ శౌలం రమేష్, ఎంపీటీసీ తుర్రే సత్యవతి, వైఎస్సార్ సీపీ నాయకులు సీరా తలుపులు నాయుడు, ఆగర దేవి, రక్షకుడు, దాడి నారాయణరావు, గర్రింగి ఈశ్వరరావు పాల్గొన్నారు.

ధర్మశ్రీ కుమార్తె ప్రచారానికి విశేష స్పందన



అడ్డసరంలో ప్రచారం చేస్తున్న ధర్మశ్రీ కుమార్తె స్వాతి

రోలుగుంట: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కరణం ధర్మశ్రీకి మద్దతుగా ఆయన కుమార్తె స్వాతి చేపట్టిన ఎన్నికల ప్రచారానికి ప్రజల నుంచి విశేష స్పందన వస్తోంది. మండలంలో పలు గ్రామాల్లో బుధవారం ఆమె ప్రచారం చేశారు. రోలుగుంటలో కళ్లాలకు వెళ్లి రైతులను కలసి వారితో మాట్లాడారు. అర్హత మేరకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు మంజూరయ్యాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అదే రోజు రాత్రి అడ్డసరం, గడబపాలెం, తదితర గ్రామాల్లో స్థానిక నాయకులతో కలసి ఇంటింటా తిరిగారు. నాలుగేళ్లుగా గ్రామాల్లో కనిపించని టీడీపీ నాయకులు ఎన్నికల సమయంలో ఓట్లు కోసం వస్తున్నారని, వారి మోసపూరిత హామీలు నమ్మొద్దని కోరారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన గుర్తించి చోడవరం ఎమ్మెల్యేగా కరణం ధర్మశ్రీని, అనకాపల్లి ఎంపీగా బూడి ముత్యాలనాయుడికి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

దివ్యాంగులు, దీర్ఘకాలిక రోగులకు పింఛన్ల పంపిణీ



మాడుగుల వృద్ధాశ్రమంలో పింఛను పంపిణీ చేస్తున్న సచివాలయ ఉద్యోగి

మాడుగుల రూరల్: సామాజిక భద్రతా పథకం కింద పింఛన్ల పంపిణీ బుధవారం చేపట్టారు. మండలంలో 11,952 మంది పింఛనుదారులకు గాను 9,020 మందికి డీబీటీ పద్ధతిలో వారి వ్యక్తిగత ఖాతాలకు జమ కాగా, మిగిలిన 2,932 మందికి గాను బుధవారం సాయంత్రానికి 2,090 మందికి పింఛన్లు పంపిణీ చేసినట్టు ఎంపీడీవో ఆర్ కాశీప్రసాదురావు తెలిపారు. దివ్యాంగులు, దీర్ఘకాలిక రోగులు, బెడ్ పేషెంట్లకు సచివాలయ సిబ్బంది ఇంటింటికి వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారన్నారు. తొలి రోజు 71.38 శాతం పంపిణీ అయిందన్నారు. మాడుగుల నియోజకవర్గ పరిధిలో చీడికాడ మండలంలో 2,265 మందికి గాను 1,668 మందికి, దేవరాపల్లి మండలంలో 2637 మందికి గాను 1749, కె.కోటపాడు మండలంలో 3,316 మందికి గాను 2657 మందికి పంపిణీ చేసినట్లు ఆయా మండలాల ఎంపీడీవోలు తెలిపారు.

జనం పక్షాన జగన్ దళం

వర్గపోరులో చంద్ర దండు

నియోజకవర్గం వివరాలు	
పంచాయతీలు	115
గ్రామాలు	154
సచివాలయాలు	87

- 5 ఏళ్లుగా గ్రామాల్లోనే అధికార పక్షం..
- ప్రజల లోటుపాట్లు తెలుసుకుంటూ సమస్యల పరిష్కారం
- 4 ఏళ్లుగా పత్తాలేని టీడీపీ నాయకులు
- వర్గపోరుతో ప్రజల్లోకి రాని ప్రతిపక్షం
- ఎన్నికల సమయంలో హడావుడి

జనం పక్షాన నిలబడింది వైఎస్సార్‌సీపీ. ఐదేళ్లలో ఏడాదికి ప్రతీ ఊరును కనీసం మూడు సార్లు ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ తన అనుచరవర్గంతో పలకరించారు. ప్రజల కష్టాలు తెలుసుకుంటూ వారి సమస్యల పరిష్కారానికి పూర్తిస్థాయిలో కృషి చేశారు. ఐదేళ్లుగా ప్రజలకు కనిపించని టీడీపీ నాయకులు ఇప్పుడు ఎన్నికల సమయంలో ఓట్ల కోసం జనం చుట్టూ తిరుగుతూ నటిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఐదేళ్లలో టీడీపీ నాయకులు, ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి, మాజీ కేఎస్ఎన్ఎస్ రాజు కనీసం ఒక్కసారి నియోజకవర్గంలో ప్రతీ ఇంటికి వెళ్లి ప్రజల కష్టసుఖాలు తెలుసుకున్న పాపాన పోలేదు.



ఇళ్ల పట్టాలు ఇస్తున్న ఎమ్మెల్యే ధర్మశ్రీ (ఫైల్)



గడపగడపకులో ఇంటింటికి వెళ్లి సంక్షేమ లబ్ధి వివరిస్తున్న ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ (ఫైల్)

వైఎస్సార్‌సీపీ చేపట్టిన కార్యక్రమం - గడపగడపకు మన ప్రభుత్వం

ఎమ్మెల్యే ధర్మశ్రీ సందర్శించిన గ్రామాలు -154
మమేకమైన గడపలు- 67,430
సచివాలయాల పరిధిలో కేటాయించిన నిధులు- రూ.17.40 కోట్లు

టీడీపీ చేపట్టిన కార్యక్రమం : బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ

తెలుసుకున్న సమస్యలు : వర్గపోరుకు కారణంగా ప్రజలతో మమేకానికి దూరం
ఫలితం : మొక్కుబడి
ప్రస్తుత పరిస్థితి : ప్రజా సమస్యలపై పోరాడాల్సిన టీడీపీ నేతలు ఎవరికీ వారే యమునా తీరే అన్నట్టుగా ఉన్నారు.

చోడవరం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతీ ఇంటికి ఏదో ఒక పథకాన్ని అందించింది. ప్రజల యోగ క్షేమాలు ఎప్పటికప్పుడు అడిగి తెలుసుకునేందుకు గడపగడపకు మన ప్రభుత్వం పేరుతో ఇంటింటికి వెళ్లి ఎమ్మెల్యే ధర్మశ్రీ ప్రజలను పలకరించారు. నియోజకవర్గంలో 115 పంచాయతీల్లో శివారు గ్రామాలతో కలిసి 154 గ్రామాల్లోనూ నిరంతరం పర్యటించారు. ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరును పరిశీలించడంతోపాటు ప్రజల కష్టాలను అడిగి తెలుసుకొని వారి సమస్యలు పరిష్కరించారు. పల్లెనిద్రలో భాగంగా రైతుల కష్టాలు తెలుసుకునేందుకు నియోజకవర్గంలో అన్ని గ్రామాల్లోనూ పర్యటించి అక్కడే భోజనాలు చేసి రాత్రి పూట బస చేసి జనంలో మమేకమయ్యారు. అంతేకాకుండా గ్రామాల్లో సమస్యలు తెలుసుకొని వాటిని పరిష్కరించారు. 87 గ్రామ సచివాలయాల పరిధిలో సచివాలయానికి రూ. 20 లక్షల చొప్పున ప్రభుత్వం ప్రత్యేక నిధులు విడుదల చేస్తే, వాటితో 357 పనులు చేశారు. గ్రామాల్లో ప్రధాన సమస్యలైన అంతర్గత రోడ్లు, కాలువలు, వీధి దీపాలు, ఇతర సమస్యలు పరిష్కరించారు.

టీడీపీ నాయకుల నుంచే రాజుకు వ్యతిరేకత

టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రాజు మాత్రం ఐదేళ్లుగా ఒక్కసారైనా కనీసం ఒక్క ఊరునుగానీ, ఇంటినిగానీ పలకరించలేదు. బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో కొన్ని గ్రామాల్లో మొక్కుబడిగా తిరిగి తర్వాత ఆయన కనిపించనేలేదు. టీడీపీ కార్యక్రమాల్లో సైతం పాల్గొనలేదు. ఇదే విషయాన్ని తన సొంత పార్టీ నాయకులే ఆ పార్టీ అధినేత చంద్రబాబుకు ఫిర్యాదు చేశారు. నాలుగేళ్లపాటు నియోజకవర్గాన్ని పూర్తిగా పట్టించుకోకుండా వదిలేసిన రాజుకు ఎమ్మెల్యే టిక్కెట్టు ఎలా ఇస్తారంటూ తిరుగుబాటు చేయడం రాజు ప్రజల్లో ఏ మేరకు ఉన్నారో అర్థమవుతోంది. బాబు ష్యూరిటీ.. భవిష్యత్ గ్యారంటీ అంటూ టీడీపీ చేపట్టిన కార్యక్రమంలో ఆ పార్టీ నాయకుల మధ్య విభేదాలను బయట పెట్టింది. గ్రూపులుగా విడిపోయి ఆ కార్యక్రమాన్ని రోడ్లపై ప్రదర్శనకే పరిమితం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో నిత్యం ప్రజల్లో ఉన్న ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ పక్షానే నిలబడేందుకు వారు సిద్ధంగా ఉన్నారు. ఎన్నికల ముందు ఓట్లు కోసం వస్తున్న టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిని నమ్మేది లేదంటూ కొన్ని గ్రామాల్లో ప్రజలు తెగేసి చెబుతున్నారు.



గవరవరంలో అధునాతనంగా నిర్మించిన బ్రిడ్జి



సర్వాంగ సుందరంగా గౌరీపట్నం రోడ్డు



బీటీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ధర్మశ్రీ (ఫైల్)



పల్లెనిద్రలో పీఎస్‌పేటలో ఓ రైతు ఇంట్లో నిద్రిస్తున్న ఎమ్మెల్యే ధర్మశ్రీ (ఫైల్)



గడపగడపకు కార్యక్రమంలో ఓ ఇంటికి వెళ్లి వృద్ధుడి ఆరోగ్య సమస్యలు తెలుసుకుంటున్న ధర్మశ్రీ (ఫైల్)

పరిష్కరించిన ప్రధాన సమస్యలు:

- నియోజకవర్గంలో మైదాన గిరిజన గ్రామాల్లో రూ. 6 కోట్లతో 28 గ్రామాల్లో మంచి నీటి సమస్యను పరిష్కరించారు.
- వడ్డాది జంక్షన్ చిన్నపాటి వర్షానికే నీటమునిగి ప్రజలు చాలా ఇబ్బందులు పడేవారు. ఈ జంక్షన్ వద్ద రూ.10 లక్షలతో సీసీరోడ్డు వేసి ఎత్తు చేయడంతోపాటు మెయిన్ డ్రైనేజీని నిర్మించారు. దీనితో ఆ సమస్య పరిష్కారం అయ్యి స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.
- చోడవరం పట్టణంలో ద్వారకానగర్‌లో మూడు దశాబ్దాలుగా కనీస సౌకర్యాలు లేక ప్రజలు చాలా ఇబ్బందులు పడేవారు. అక్కడ రూ. 50 లక్షలతో సీసీరోడ్డు, మెయిన్ డ్రైనేజీ ఏర్పాటు చేశారు. ఈ కాలువ ఏర్పాటు చేయడంతో ద్వారకానగర్ ముంపు నుంచి బయటపడింది. వీధి కొళాయిలు ఏర్పాటు చేసి ఇక్కడ ప్రజల మంచినీటి సమస్య తీర్చారు.
- రూ.11 కోట్లతో గవరవరం వంతెన నిర్మాణం పూర్తి చేసి ప్రారంభించారు. చోడవరం, దేవరాపల్లి మండలాలను కలుపుతూ శారదానదిపై ఈ వంతెన ఉంది. ఈ వంతెన 2015లో కూలిపోతే అప్పటి టీడీపీ ప్రభుత్వం పట్టించుకోకపోతే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వేగంగా నిర్మించి ప్రారంభించడంతో పూర్తిగా రహదారి సమస్య తీరింది.
- నియోజకవర్గంలో అన్ని గ్రామాల్లోనూ అవసరమైన చోట్ల గడపగడపకు మన ప్రభుత్వం నిధులతో గ్రామానికి సీసీరోడ్లు, కాలువలు నిర్మించారు.
- రూ.13 కోట్లతో రాజాం, తట్టబంద, కుసర్లపూడి, గౌరీపట్నం, జుత్తాడ, భోగాపురం, తోటకూరపాలెం, బీబీపట్నం, కొట్నాబిల్లి రోడ్లు దెబ్బతినడంతో వాటిని పూర్తిగా కొత్త రోడ్లుగా నిర్మించారు.

చంద్రబాబుది మోసపూరిత మేనిఫెస్టో

- బీజేపీ అగ్రనేతలే నమ్మడం లేదు
- పలు గ్రామాల్లో ధర్మశ్రీ విస్తృతంగా ఎన్నికల ప్రచారం



చీమలపాడు గిరిజన పంచాయతీలో ప్రచారం చేస్తున్న ధర్మశ్రీ



మర్రివలసలో ఓటు అభ్యర్థిస్తున్న ధర్మశ్రీ

రావికమతం: చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఇచ్చిన ఆచరణ సాధ్యం కాని మేనిఫెస్టోను కూటమిలోని బీజేపీ పెద్దలే కాదు, ప్రజలెవ్వరూ నమ్మడం లేదని ప్రభుత్వ విప్, వైఎస్సార్‌సీపీ చోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి కరణం ధర్మశ్రీ అన్నారు. మండలంలోని కన్నంపేట, ఒమ్మవరం, మర్రివలస, ధర్మవరం, చీమలపాడు, జెడ్.కొత్తపట్నం, గంపవానిపాలెం, దొండపూడి, మత్స్యవానిపాలెం, కిత్తంపేట, జెడ్.బెన్నవరం గ్రామాల్లో బుధవారం విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అడుగడుగునా ధర్మశ్రీకి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ ఐదేళ్లలో చేసిన అభివృద్ధి, సంక్షేమం గురించి వివరించారు. అనంతరం మాట్లాడుతూ సీఎం జగన్మోహనరెడ్డి చిత్తశుద్ధితో 99 శాతం హామీలను అమలు చేస్తే, రాష్ట్రం శ్రీలంక, పాకిస్తాన్ మాదిరి దివాలా తీసిందని హేళన చేసిన చంద్రబాబు ఈ మారు మరో మోసపూరిత హామీలతో ఏకంగా రూ.12 లక్షల కోట్ల బడ్జెట్‌కుపైగా ఖర్చయ్యే మేనిఫెస్టోను తోడుదొంగలైన బాబు, పేకేజీ స్టార్ ఇవ్వడం హాస్యాస్పదమన్నారు. వారి మోసపూరిత హామీల మేనిఫెస్టోను బీజేపీ అగ్రనేతలే నమ్మలేదని, కనీసం తాకడానికి ఇష్టపడలేదని గుర్తు చేశారు. మేనిఫెస్టోను భగవద్గీత, బైబిల్, ఖురాన్‌లా భావించే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆచరణ సాధ్యమైనవే మేనిఫెస్టోలో పొందుపర్చి ప్రజల విశ్వాసాన్ని చూరగొన్నారన్నారు. మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్ వస్తేనే ఈ పథకాలన్నీ అమలవుతాయని, వలంటీర్‌తో ఇంటింటికీ మళ్లీ పింఛన్ వస్తుందని మర్చిపోవద్దన్నారు. ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేసి మరో మారు అవకాశం కల్పించాలని కోరారు. ఎంపీపీ పైల రాజు, ఆ పార్టీ మండలాధ్యక్షుడు ముక్కా మహలక్ష్మినాయుడు, జెడ్పీటీసీ తలారి రమణమ్మ ఆదిమూర్తి, డీసీఎంఎస్ డైరెక్టర్ గుమ్ముడు సత్యదేవ, మండల సచివాలయ కన్వీనర్ కంచిపాటి జగన్నాథరావు, వైస్ ఎంపీపీ దంట్ల వెంకటరమణ, మాజీ జెడ్పీటీసీ ఆశరి వాసుగోవిందరావు, ఆయా గ్రామాల ముఖ్య నాయకులు అంతరమణ, లోవరాజు, వంజరి గంగరాజు, చిన్ని చినమ్మలు, గాలి రమణబాబు, మరువాడ రాజులమ్మ, రాజారావు, మలిచెట్ల గణేష్, పి.లక్ష్మి, చిరంజీవి పాల్గొన్నారు.

జగనన్నను గెలిపిస్తేనే సంక్షేమ పథకాలు

- ఓటమి భయంతో చంద్రబాబు దగాకోరు హామీలు
- 11 పంచాయతీల్లో ఎమ్మెల్యే అభ్యర్థి ఈర్లె అనురాధ ఎన్నికల ప్రచారం



ఎమ్మెల్యే అభ్యర్థి ఈర్లె అనురాధకు మద్దతుగా చేపట్టిన వైఎస్సార్‌సీపీ శ్రేణుల బైక్ ర్యాలీ



పెదనందిపల్లిలో ఎమ్మెల్యే అభ్యర్థి అనురాధను సత్కరిస్తున్న మహిళలు



తామరబ్బలో సీఎం జగన్ మాస్కులతో ప్రత్యేక ఆకర్షణగా గిరిజన మహిళలు

దేవరాపల్లి: పేదల ఆర్థికాభివృద్ధి లక్ష్యంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలన్నీ కొనసాగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని వైఎస్సార్‌సీపీ మాడుగుల ఎమ్మెల్యే అభ్యర్థి ఈర్లె అనురాధ కోరారు. మండలంలో ముషిడిపల్లి, కె.ఎం.పాలెం, ఎ. కొత్తపల్లి, పెదనందిపల్లి, కాశీపురం, తామరబ్బ, చింతలపూడి, వాలాబు, రైవాడ, మారేపల్లి పంచాయతీలో బుధవారం ఆమె విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో కోలాటం, తీన్‌మార్ వాయిద్యాలు నడుమ గ్రామస్తులు బ్రహ్మరథం పట్టారు. మహిళలు తిలకం దిద్ది, హారతులు పట్టి, పూల వర్షం కురిపించి ఆత్మీయ స్వాగతం పలికి తమ అభిమానాన్ని చాటారు. మరోవైపు మండుటెండను సైతం లెక్క చేయకుండా అధిక సంఖ్యలో ప్రజలు తరలిరావడంతో పండగ వాతావరణం తలపించింది. అనురాధకు మద్దతుగా మండల వ్యాప్తంగా పార్టీ శ్రేణులు భారీ బైక్ ర్యాలీ చేపట్టి సంఘీభావం తెలిపారు. జై జగన్, జై బూడి, జై అనురాధ నినాదాలతో పార్టీ శ్రేణులు హోరెత్తించాయి. తామరబ్బలో గిరిజన మహిళలు సీఎం జగన్ మాస్కులు ధరించి జగన్ పట్ల తమకున్న అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభ్యర్థి అనురాధ మాట్లాడుతూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే తన తండ్రి ముత్యాలనాయుడును ఎంపీగా, తనను ఎమ్మెల్యేగా ఫ్యాన్ గుర్తుపై ఓటేసి గెలిపించాలని కోరారు. ధన బలంతో విర్రవీగుతున్న స్థానికేతరులైన టీడీపీ, బీజేపీ అభ్యర్థులను వైఎస్సార్‌సీపీ జన బలంతో బుద్ధి చెప్పాలన్నారు. ఓటమి భయంతో చంద్రబాబు అడ్డగోలు హామీలను నమ్మి మోసపోవద్దని, జగన్ మాట ఇచ్చారంటే అమలు చేసి తీరుతారన్నారు. జెడ్పీటీసీ కర్రి సత్యం, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బూరె బాబూరావు, వైస్ ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి, రాష్ట్ర మహిళా సంయుక్త కార్యదర్శి రొంగలి నారాయణమ్మ, సర్పంచ్‌లు చింతల సత్యవెంకటరమణ, మతల దేముడమ్మ, గంధం రామకృష్ణ, సోమిరెడ్డి సన్నిబాబు, టోకురి రామకృష్ణ, దొమ్మంగి బోడెమ్మ, చల్లా లక్ష్మి, రొంగలి వెంకటరావు, దాసరి సంతోష్‌కుమార్, ఉప సర్పంచ్ కాటిపాం పెదనాయుడు, ఎంపీటీసీలు బొడ్డు లక్ష్మీ, వంటాకు పైడితల్లమ్మ, బండి గౌరమ్మ, కోలా గోపి, ఉగ్రాకుల అప్పారావు, దాసరి మంగునాయుడు, కొప్పుల వెలమ, గవర కార్పొరేషన్ డైరెక్టర్లు వరదపురెడ్డి సింహాచలంనాయుడు, దాడి జగన్, జేసీఎస్ మండల కన్వీనర్ కేవీ రమణ, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి దాసరి గోపి, ఆర్వీకే నాయుడు, చింతు రాము పాల్గొన్నారు.

వింటిపాలెంలో పూరిల్లు దగ్ధం



కాలి బూడిదైన పూరిల్లు

చీడికాడ: తునివలస శివారు వింటిపాలెంకు చెందిన చిట్టంకి సూర్యనారాయణ పూరిల్లు కాలిపోయింది. రూ.3 లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లింది. ఈ ప్రమాదంలో వంటపాత్రలు, విద్యుత్ మీటర్, మంచాలు, ధాన్యం, రూ.3 వేల నగదు, ఫర్నిచర్ అగ్నికి ఆహుతయ్యాయి. దీంతోపాటు పక్కనే శ్లాబ్ ఇంటి తలుపులు కాలిపోయాయి. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు సూర్యనారాయణ కోరాడు.

బూడి, అనురాధలను ఆశీర్వదించండి

- డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు సతీమణి రమణమ్మ ప్రచారం



దేవరాపల్లిలో ప్రచారం చేస్తున్న బూడి రమణమ్మ

దేవరాపల్లి: డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సతీమణి రమణమ్మ బుధవారం రాత్రి దేవరాపల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానిక సోమిరెడ్డి వారి కల్లాలు, యాతపేట, రాజుల వీధిలో ఇంటింటా పర్యటించిన ఆమెకు మహిళలు ఘన స్వాగతం పలికారు. మునుపెన్నడూ లేని విధంగా దేవరాపల్లిని అభివృద్ధి చేసిన ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడును, మాడుగుల ఎమ్మెల్యే అభ్యర్థి ఈర్లె అనురాధను ఫ్యాన్ గుర్తుపై ఓటేసి గెలిపించాలని కోరారు. శివారు ప్రాంతాలకు తారురోడ్లు, అంతర్గత సీసీరోడ్లు, డ్రైనేజీలు, కమ్యూనిటీ హాళ్లు, నాలుగు రోడ్ల కూడలి నుంచి పోలీస్ స్టేషన్‌కు, శారదానదికి వెళ్లే రోడ్లు విస్తరణతోపాటు ఆర్టీసీ కాంప్లెక్స్ ఆధునికీకరణ చేశారు. డాక్టరు వరదపురెడ్డి సింహాచలంనాయుడు, వరదపురెడ్డి లలితానాయుడు, గండిపదాల అప్పలరాజు, జేసీఎస్ మండల కన్వీనర్ కేవీ రమణ, వరదపురెడ్డి చంద్రరావు పాల్గొన్నారు.

అంబరాన్నంటిన మే డే వేడుక



రావికమతం:కొత్తకోటలో జెండా ఎగురవేస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి గోవింద్



చోడవరం రూరల్: ఎర్రజెండాలతో కార్మికుల ప్రదర్శన

చోడవరం/రూరల్/రావికమతం/బుచ్చెయ్యపేట/కె.కోటపాడు/మాడుగుల రూరల్: కార్మికులంతా మే డే వేడుకలను ఎంతో సంబరంగా బుధవారం జరిపారు. ఈ వేడుకల్లో అన్ని కార్మిక సంఘాలు ఒకటిగా కదిలాయి. చేయిచేయి కలిపి కార్మిక హక్కులు ప్రభుత్వాలు కాలరాసేందుకు ప్రయత్నిస్తున్నాయని, అటువంటి యోచనను మానుకోవాలని కార్మికులంతా ముక్తకంఠంతో హెచ్చరించారు. పలుచోట్ల ఎర్రజెండాలు ఎగురువేసి జోహార్లంటూ నినాదాలు చేశారు. రిక్షాకార్మికులు, హమాలీలు, డ్రైవర్లు, తదితరులు ర్యాలీలు చేసి మానవహారం నిర్వహించారు.

'బీజేపీ అభ్యర్థులను ఓడించండి'

మాడుగుల రూరల్: రాష్ట్రానికి ద్రోహం చేసిన బీజేపీ అభ్యర్థులను ఓడించి, భావి తరాలు భవిష్యత్తు కోసం ఓటు అనే ఆయుధంతో నిజాయతీ గలవారిని ఎన్నుకోవాలని ప్రత్యేక హోదా విభజన సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు చలసాని శ్రీనివాస్ అన్నారు. బుధవారం సాయంత్రం మాడుగులలో ఆంధ్రుల హక్కులు ఆత్మగౌరవ పోరాట యాత్రలో భాగంగా బుధవారం ఆయన మాట్లాడారు. బీజేపీని నమ్మవద్దని, విశాఖ స్టీల్‌ప్లాంటును రక్షించుకుందామన్నారు. ఆంధ్రా మేధావుల ఫోరం అధ్యక్షుడు జి. అప్పలనాయుడు, రాష్ట్ర యువజన జేఏసీ అధ్యక్షుడు పత్తిపాటి బాలరాజు, సీఐటీయూ డివిజన్ కార్యదర్శి రొంగలి దేముడునాయుడు, ఆదివాసీ గిరిజన సంఘం ఐదో షెడ్యూల్ సాధన కమిటీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇ. నర్సింహమూర్తి పాల్గొన్నారు.

రిమాండ్ ఖైదీలకు న్యాయ సహాయం



సబ్ జైలు ఖైదీలనుద్దేశించి మాట్లాడుతున్న సబ్ జడ్జి రాజేంద్రబాబు

చోడవరం రూరల్: నేరారోపణలపై సబ్ జైలు జీవితం గడుపుతూ న్యాయవాదుల్ని నియమించుకోలేని రిమాండ్ ఖైదీలకు మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ ద్వారా ఉచితంగా న్యాయ సహాయం అందిస్తున్నట్టు మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, ఇన్‌చార్జి సబ్ జడ్జి, గాజువాక ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఇ.రాజేంద్రబాబు తెలిపారు. ఇంతవరకు ఇక్కడ సీనియర్ జడ్జిగా సేవలందించిన సత్తి అరుణశ్రీ విజయనగరం జిల్లా బొబ్బిలి కోర్టుకు బదిలీపై వెళ్లగా, రాజేంద్రబాబు అదనపు బాధ్యతలు చేపట్టారు. బుధవారం మేడే సందర్భంగా ఆయన స్థానిక సబ్ జైలు ఖైదీలకు న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. సబ్ జైలు ఆవరణ, పరిసరాల పరిశుభ్రత, ఖైదీల ఆహార పదార్థాల నాణ్యతలను పరిశీలించిన మీదట వారినుద్దేశించి మాట్లాడారు. నేర ప్రవృత్తిని వీడి సమాజంలో మంచి నడవడికతో మసలుకోవాలని ఆకాంక్షించారు. లోక్ అదాలత్ ద్వారా న్యాయ సహాయం అందుతుందన్నారు. సబ్ జైలు హెడ్ వార్డర్ వి.వీర్రాజు, న్యాయవాది భూపతి రాజు పాల్గొన్నారు.